క్లుప్తంగా

సబ్సిడీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్నవారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో బ్యాంక్ అధికారులు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు చేపట్టారు. 27 యూనిట్లకు 215 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. దరఖాస్తుదారుల ఒరిజినల్ ధ్రువ పత్రాలను పరిశీలించి, ఎంపికైనా వారి పేర్లు త్వరలో ప్రకటిస్తామని బ్యాంక్ అధికారులు వెల్లడించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు


రాపూరులో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

రాపూరు: మండలంలోని అన్ని గ్రామాల్లోని గేదెలు, ఆవులకు గాలి కుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ వైద్యులు అనిల్‌కుమార్, సుప్రజ తెలిపారు. మండలంలోని తెగచర్ల, శానాయిపాళెం, రాపూరు గ్రామాల్లో బుధవారం గాలి కుంటు వ్యాధి నివారణకు 300 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, రైతులు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

శ్రీరాజరాజేశ్వరికి వార్షిక పూజలు


హోమంలో పాల్గొన్న ఉభయకర్తలు

చిల్లకూరు: గూడూరు పట్టణం సత్రపు వీధిలో వెలసియున్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి వెండి చీరతో అలంకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఏలూరు వరదారెడ్డి, విమలమ్మ, బట్టిరెడ్డి ఇంద్రసేనామంజునాథ రెడ్డి, మాధురి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, ఉషారాణి, నక్కా సుబ్రహ్మణ్యం, ఇందుమాధవి వ్యవహరించారు. ఆలయ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కోదండరామయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కండలేరులో 51.314 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 51.314 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 760, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఓజిలి మండలం ఆర్మేనిపాడులో కూటమి నాయకులు వేసిన నాసిరకం సీసీ రోడ్డు



నాయుడుపేట మండలం చిగురుపాడు అగ్రహారం ఎస్సీ కాలనీలో కూటమి నాయకులు వేసిన సీసీ రోడ్డు



గ్రామ స్వరాజ్యం.. గంగపాలు

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచుల అధికారాలు, హక్కులను కూటమి ప్రభుత్వం హరించి వేస్తోంది. వారికి పవర్ లేకుండా చేస్తూ సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. తాము అధికారంలోకి రాగానే సర్పంచులకే అన్ని అధికారాలు ఇచ్చేస్తామని నమ్మించి పదవిలోకి రాగానే సర్పంచులకి పవర్ లేకుండా చేస్తున్నారు. అధికార బలంతో టీడీపీ కూటమి నాయకుల జేబులు నింపేందుకు పన్నాగం పన్నుతున్నారు. – సూళ్లూరుపేట

- సర్పంచుల అధికారాలను హరిస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రజలు ఎన్నకున్న సర్పంచిని పక్కన పెట్టి తెలుగు తమ్ముళ్లకే పనులు
- కూటమి నాయకుల ఆర్థిక పరిపుష్టికి అధికార బలంతో సహకారం

గ్రామంలో సర్పంచి అంటే ప్రథమ పౌరుడు. చెక్ పవర్ కలిగి ఏ పని చేయాలన్నా ఆయన ద్వారా అప్రూవల్ తీసుకుని పనులు చేయాల్సి ఉంటుంది. ఆ అధికారాన్ని లేకుండా చేస్తోంది కూటమి ప్రభుత్వం. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇటీవల గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు మంజూరు చేశారు. ఈ రోడ్లకు సర్పంచి అప్రూవల్ ఇవ్వాల్సి ఉంది. అయితే వారి అధికారాలను పక్కన పెట్టేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్, లేదంటే ఆ గ్రామంలో కూటమి పార్టీలకు చెందిన సీనియర్ సిటిజన్ అప్రూవల్ తీసుకుని గ్రామంలోని టీడీపీ నాయకులకు పనులు అప్పగిస్తున్నారు. దీనికి సంబంధించిన బిల్లులు నిబంధనల మేరకు సర్పంచి ఖాతాలోనే జమ చేయాల్సి ఉంది. సర్పంచికి ఉన్న అధికారాలన్నీ తీసేసి ఎవరైతే పనులు చేస్తారో వారి ఖాతాకే వేసే విధంగా అధికార దుర్వినియోగం చేస్తున్నారు. అంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కూటమి నాయకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ పన్నాగం. గ్రామ పంచాయతీల్లో సర్పంచిలు 90 శాతం మంది వైఎస్సార్ సీపీకే చెందిన వారు ఉన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం ఈ కుట్రకు తెరతీసింది. గ్రామాల్లో ప్రస్తుత సర్పంచులకు వ్యతిరేకంగా ఉన్న కూటమి నాయకులను ఎంపిక చేసుకుని మరీ పనులు అప్పగిస్తున్నారు.

కూటమికి మేత

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 128 పంచాయతీలున్నాయి. ఈ పంచాయితీల్లో 158 సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.10.49 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులన్నింటినీ ఆయా గ్రామ పంచాయతీల్లోని కూటమి ప్రభుత్వానికి చెందిన వారికే అప్పగించారు. ఇందులో టీడీపీ నాయకులే ఎక్కువగా ఉన్నారు. సూళ్లూరుపేట మండలంలో 19 సీసీ రోడ్లకు రూ.1.20 కోట్లు, నాయుడుపేట మండలంలో 24 రోడ్లకు రూ.1.40 కోట్లు, తడమండలంలో 28 రోడ్లుకు రూ.1.90 కోట్లు, దొరవారిసత్రం మండలంలో 29 పనులకు రూ.1.98 కోట్లు, పెళ్లకూరు మండలానికి 24 రోడ్లకు రూ.1.95 కోట్లు, ఓజిలి మండలానికి 34 రోడ్లకు రూ.2.06 కోట్లు మంజూరు చేశారు. ఇందులో 75 శాతం రోడ్ల పనులు పూర్తి చేయగా మరో 25 శాతం నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ పనుల్లో ఎక్కడా సర్పంచులకు ప్రమేయం లేకుండా చేసి కూటమి నేతలకు అప్పనంగా అప్పగించి ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్నారు. కూటమి నేతల భవనాలకు, పొలాలకు రోడ్లు వేసుకున్న సందర్భాలున్నప్పటికీ అధికారులు నోరు విప్పలేకపోతున్నారు.

సర్పంచి తీర్మానం లేకుండా రోడ్లు వేశారు



ఇలుపూరు పంచాయతీలో సర్పంచి తీర్మానం లేకుండానే పెరిమిటిపాడులో టీడీపీ నాయకులు సీసీ రోడ్డు నిర్మించారు. సర్పంచి అధికారాన్ని పక్కన పెట్టి చేసి మరీ రోడ్లు వేయడం బాధాకరం. రోడ్లు వేసుకోవాలంటే సర్పంచి తీర్మానాన్ని తీసుకోవాలి. సర్పంచికి పూర్తిస్థాయి అధికారాలు కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పింది. వైఎస్సార్ సీపీ మద్దతుగా ఉన్న సర్పంచులు ఉన్న చోట టీడీపీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

– తేరే కృష్ణయ్య, ఇలుపూరు సర్పంచి, సూళ్లూరుపేట మండలం

సర్పంచ్ అధికారాన్ని తుంగలో తొక్కారు



వెదురుపట్టు పంచాయతీ పరిధిలో మాతో పని లేకుండానే, పంచాయతీ తీర్మానం లేకుండానే అధికార పార్టీ నాయకులు సీసీ రోడ్లు వేసేశారు. సర్పంచికి సర్వాధికారాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ అధికారంలో రాగానే ఇచ్చిన మాట మరిచిపోయారు. వారి పార్టీకి చెందిన వారిని ఆర్థికంగా బలవంతులను చేయాలని గ్రామ స్వపరిపాలనను అణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా చేయడం కూటమి ప్రభుత్వానికి తగదు.

– ఎన్.మధురెడ్డి, సర్పంచ్, వెదురుపట్టు, దొరవారిసత్రం మండలం

నేడు నేదురుమల్లి రాక

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సా కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నట్లు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం నుండి నేదురుమల్లి నివాసంలో రామ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

నేడు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ఓజిలి: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బీసీ, ఈబీసీ కార్పొరేషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 52 యూనిట్లకుగాను 271 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఓజిలి–19, ఆర్మేనిపాడు యూనియన్ బ్యాంక్–17, కురుగొండ ఆంధ్రప్రగతి యూనియన్ బ్యాంక్ 16 యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. లబ్ధిదారులు ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు ఆయా బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో జరుగుతాయని స్థానిక ఎంపీడీఓ గోవర్ధన బుధవారం తెలియజేశారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

దెబ్బతిన్న పైపులైన్లు పరిశీలన

కోట: కొత్తపాళెంలో తాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా అధికారులు బుధవారం విచారణ జరిపారు. విద్యానగర్ నుంచి కొత్తపాళెం మీదుగా సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు చేస్తున్న క్రమంలో ఆదేమార్గంలో భూమిలో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలకు సంబంధించిన మూడు పైపులైన్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సర్దార్‌హుస్సేన్, డీఈ నందకుమార్ దెబ్బతిన్న పైపులైన్లను పరిశీలించారు. సాగరమాల ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. పైపులైన్ల మరమ్మతులు జరిపించేందుకు వారు అంగీకరించినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వేలు పక్కాగా నిర్వహించాలి


బేరిపేట సచివాలయంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా

నాయుడుపేట టౌన్: ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల సర్వేలను వార్డు సచివాలయ ఉద్యోగులు పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న బేరిపేట వార్డు సచివాలయాన్ని కమిషనర్ బుధవారం పరిశీలించారు. సచివాలయ పరిధిలో ఇప్పటి వరకు వివిధ విభాగాల సెక్రటరీలు చేసిన సర్వే తదితర విషయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం సూచించిన మేరకు పీ4, ఎంఎస్ఎంఈ, వర్క్‌ఫ్రం హోం, చిన్న పిల్లలు ఆధార్ డేటా తదితర అంశాలపై విధివిధానాల మేరకు సర్వేలను పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించరాదన్నారు.

బాలికల చదువుతోనే సమాజ వికాసం

డక్కిలి: సమాజంలో ఆడబిడ్డ అంటే చిన్నచూపు ఉండ దని దీనిని పోగొట్టేందుకు తల్లి దండ్రులు బాలికలను ఉన్నత చదువులు చదివించాలని ఎస్ఐ శివశంకర్ తెలిపారు.
అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు పురస్కరించుకుని మండల కేంద్రమైన డక్కిలిలో మహిళా సాధికారతపై అవగాహన ర్యాలీ కల్పించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అలా జరిగితే వెంటనే పోలీసులు, ఐసీడీఎస్ అధికారు ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీడీపీఓ శంషాద్‌బేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యోగాపై ప్రత్యేక దృష్టి సారించాలి

సైదాపురం: మహిళలు ఆరోగ్యకరంగా ఉండేందుకు యోగాపై ప్రత్యేక దృష్టి సారించాలని రాపూరు సీడీపీఓ సునంద సూచించారు. మండలంలోని చాగణం ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువ లున్న ఆహారం తీసుకోవాలన్నారు. బాల్యావివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాలింతలు, గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు తదితర పౌష్టికారాన్ని తీసుకోవాలని కోరారు. చట్టాలపై కూడా మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ అధికారులు విద్యార్థులకు భేటీ బచావో–భేటీ పఢావో, బాల్య వివాహాల నిర్మూలన, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై సీడీపీఓ శారదాంబ అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో రాణించి తల్లిదండ్రులకు, విద్యను అందించిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పార్వతి, సూపర్‌వైజర్ హేమలత, కార్యకర్తలు లీలమ్మ, ప్రసన్న, టీచర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోట: మద్యంలో విషపు గుళికలు కలిపి, తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం శ్యాంసుందరపురంలో చోటుచేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్యాంసుందరపురానికి చెందిన ఈగ హరి(40) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అప్పుల బాధతో మద్యంలో విషపు గుళికలు కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు


అవగాహన కల్పిస్తున్న ఏఓ హైమావతి

సైదాపురం: రైతులకు అందుబాటులోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏఓ హైమావతి కోరారు. మండలంలోని వేములచేడు, అనంతమడుగు గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ముందుగా వీఏఏల ద్వారా షెడ్యూలింగ్ ఇచ్చి కూపన్ తీసుకున్న తర్వాత తేమ శాతం తీసు కుని ధాన్యం ప్రొక్యూర్మెంట్ చేసుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేశారనే విషయాలను కూడా ప్రతి రైతుకు తెలియజేశామన్నారు. మండలంలో 7 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశ్రామిక వాడలో మహిళ హత్య

తడ: మండలంలోని మాంబట్టు ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలో ఓ వివాహిత(25)ను చంపి పడేసిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి మాంబట్టు సెజ్‌కు వెళ్లే దారిలో ఉన్న కొడూరు చెరువు వద్ద ఉదయం దుర్గంధం వస్తుండడంతో స్థానికుల సమాచారం మేరకు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండపనాయుడు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గడ్డి పొదల చాటున ఉన్న కాలువలో వెల్లకిలా పడేసి, పైన కాలిన చెట్టు మొద్దును ఉంచి కప్పి పెట్టిన మహిళ మృత దేహాన్ని పోలీసులు గుర్తించి వెలికి తీశారు. చనిపోయి నాలుగు రోజులు కావడంతో శవం గుర్తు పట్టలేని విధంగా మారింది. కాలువలో పెద్దగా నీళ్లు లేకపోవడంతో ఆమెను చంపి కాలువలో పడేసి ఉండవచ్చని, కాలువ చుట్టూ గడ్డి పెరిగి ఉండడంతో దుర్గంధం వచ్చే వరకు బయటకు తెలియలేదని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి సమీపంలో ఓ బ్యాగు, దుప్పటి, కట్‌షూ జత, రెండు జతల దుస్తులతోపాటు పేస్ క్రీం, టూత్ పేస్టు, బ్రష్‌లు, ప్లాస్టిక్ గాజులు, బొట్టుబిళ్లలు ఉన్నాయి. చుడిదార్ ధరించిన ఈమె ఎడమ చేతిపై ఇర్ఫాన్ పేరు మధ్యలో లవ్ గుర్తు తరువాత అనిత అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉంది. కాలికి మెట్టెలు ఉండడంతో వివాహితగా భావిస్తున్నారు. శవం వద్ద లభించిన వస్తువులతోపాటు అక్కడ ఉన్న బట్టల షాపు బ్యాగుపై అడాస్‌పూర్, ఒడిశా అని ఉండడంతో ఆమెను ఒడిశావాసిగా భావించి, స్థానిక పరిశ్రమలు, హోటళ్లకు పోలీస్ సిబ్బంది సమాచారం అందించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సంఘటనా స్థలాన్ని పరిశీంచారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కోట: పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ బాలక్రిష్ణ నాయక్ సూచించారు. చిట్టేడు పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. డాక్టర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న డాక్టర్ వెంకటరమణను డీఎంఅండ్‌హెచ్‌ఓ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లింపుతో అభివృద్ధి

చిట్టమూరు: ఇంటి యజమానులు త్వరగా ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి పి.వెంకటరమణ కోరారు. మండల పరిధిలోని మల్లాం గ్రామంలో బుధవారం ప్రత్యేక హౌస్ టాక్స్ కలెక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను విధిగా చెల్లించి, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పన్ను చెల్లించిన వారికి స్వయంగా రసీదులు అందజేశారు. ఇంటి పన్ను ద్వారా వసూలు చేసిన నగదును తమ గ్రామంలోనే అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామన్నారు. మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూపీసీ రిసోర్స్ పర్సన్ రవి, ఎంపీడీఓ మనోహర్ గౌడ్, ఈఓపీఆర్డీ జనార్దన్ పాల్గొన్నారు.

లాటరీ టికెట్లు విక్రయించే ముగ్గురి అరెస్టు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలో లాటరీ టికెట్లు విక్రయించే ముగ్గురిని పట్టుకున్నట్లు సీఐ బాబీ బుధవారం రాత్రి తెలిపారు. లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో బుధవారం రాత్రి సీఐ పోలీసులతో గరిడీవీధి తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, ముగ్గురిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలో లాటరీలు విక్రయించే నయనప్పగారి మనోహర్, వెంపళ్ల సుబ్రహ్మణ్యం, వేముగుంటపాళెంకు చెందిన సంగీతం బాలాజీ అనే వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రీసర్వే పరిశీలన

వెంకటగిరి రూరల్: వెంకటగిరి రూరల్ మండలంలోని బాలసముద్రం గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను డిస్ట్రిక్ట్ ల్యాండ్ సర్వే అధికారి డి.అరుణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో రీసర్వే రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే పక్కాగా నిర్వహించాలని సూచించారు. తహశీల్దార్ రాంబాబు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా జాతర

చిల్లకూరు: తూర్పుకనుపూరు శ్రీముత్యాలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపడుతామని గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. తూర్పుకనుపూరులో బుధవారం ఆమె పర్యటించి, జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు 6 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, మూడు రోజులు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. త్వరలో జరిగే జాతర శాంతి సమావేశంలో బందోబస్తుపై ప్రత్యేక చర్యలు తీసుకునేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కూడా పరిశీలిస్తామన్నారు. జాతరలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుటామని తెలిపారు. ఆమె వెంట గూడూరు రూరల్, వాకాడు సీఐలు కిశోర్‌బాబు, హుసేన్‌బాషా ఉన్నారు.

సైనికుల్లా పని చేస్తున్నారు

గూడూరు రూరల్: విద్యుత్ లైనమెన్ సైనికుల్లా పని చేస్తున్నారని విద్యుత్ శాఖ డీఈఈ నరేంద్రరెడ్డి కితాబిచ్చారు. పట్టణంలోని డీసీఆర్ కమ్యూనిటీ హాల్‌కు పక్కనే ఉన్న సబ్ స్టేషన్ వద్ద బుధవారం లైన్‌మెన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు లైనమన్లను అభినందించారు. ఈ ప్రసాద్, శేషాద్రి, భాస్కర్, ఏడుకొండలు, రమేష్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

రోటరీ ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు


ఇంజనీరింగ్ విద్యార్థులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్: రోటరీ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ సాధు గోపాలక్రిష్ణ తెలిపారు. బొమ్మిరెడ్డి రోటరీ కన్వెన్షన్ భవన్‌లో మంగళవారం రాత్రి నూతన సభ్యత్వాలను చేపట్టారు. ఈ ఏడాదిలో చేపట్టనున్న కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీడీజీ సురేంద్ర, మునిగిరీష్, దశరథరామిరెడ్డి, డాక్టర్ జనార్దనరెడ్డి, రోహిణి పాల్గొన్నారు.

జనావాసాల్లోకి దుప్పి



కోట: లక్ష్మక్కకండ్రిగ పంట పొలాల్లోకి బుధవారం చుక్కల దుప్పి రావడంతో కుక్కలు వెంబడించి గాయపరిచాయి. కుక్కల బారి నుంచి తప్పించుకునే క్రమంలో చుక్కల దుప్పి జనావాసాల్లోకి చేరింది. గ్రామస్తులు రక్షించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన చుక్కల దుప్పి కళేబరాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

మద్యం షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

సైదాపురం: మండల కేంద్రంలోని మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయించాలని, లేకుంటే లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మద్యం దుకాణం వద్ద మందు తాగితే కూడా చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు కాలేషా, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.